రోడ్లపైనే వ్యాపారాలు...

ప్రధాన రహదారులను అక్రమించి వ్యాపారాలు

అత్తాపూర్: ట్రాఫిక్ నియమనిబంధనలను ఉల్లంఘిస్తూ చిరువ్యాపారస్తులు ఎవరికి వారు ఇష్టారాజ్యంగా ప్రధాన రహదారుల్లో వ్యాపారం చేసుకుంటూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

- పీవీ నర్సింహరావు ఎక్స్‌ప్రెస్‌వే ఈశ్వర్ థియేటర్ నుంచి గోల్డెన్ ప్యాలెస్ హోటల్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్లు, జ్యూస్ సెంటర్లు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఆ మార్గం గూండా వెళ్లే వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు.
- డీమార్ట్ సమీపంలో కొద్దిపాటి వర్షానికి నదిగా మారుతూ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు వరద నీరు వెళ్లేందుకు 191 పిల్లర్ వద్ద పనులు ప్రారంభించారు. త్వరితగతిన పూర్తి చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతూ ప్రమాదాల బారినపడుతున్నారు.



హైదర్‌గూడ రహదారిపైనే తోపుడు బండ్లతో చిరువ్యాపారులు

- శివరాంపల్లి వద్ద రోడ్డుకు ఇరువైపులా అనధికారికంగా నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలున్నాయి. దీంతో ఇటీవల ఓ ద్విచక్ర వాహనాదారుడు మృతి చెందాడు. రోడ్లపై వెలసిన అక్రమ నిర్మాణాలు, ఎవరికి వారు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసుకున్న హోటళ్లు తదితర వ్యాపారులు చేసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- ఆరాంఘర్ చౌరస్తా నుంచి శివరాంపల్లి వద్ద ఓ దుకాణాదారుడు 300 గజాల స్థలానికిపైగా ఆక్రమించి ప్రధాన రహదారిపైనే వ్యాపారం చేసుకుంటున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. శివరాంపల్లి చౌరస్తా నుంచి ఆరాంఘర్‌కు వెళ్లే ప్రధాన రహదారి అనుసంధానం చేసిన సర్వీస్ రోడ్డును ఏకంగా వ్యాపార కేంద్రంగా మార్చివేశారు.

చర్యలు తీసుకుంటాం



రోడును ఆక్రమించి చిరువ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. అక్రమంగా రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయడం సరికాదు. దీని కారణంగా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ పోలీసులతో డ్రైవ్ చేపడుతున్నాం. ఐటీ కారిడార్‌కు ఈ ప్రాంతానికి ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. పిల్లర్ నెంబర్ 191 వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించాల్సి ఉంది.

– బోసుకిరణ్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ముదిరాజ్‌లకు ఆర్థిక సహాయం అందించాలి

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ కులస్తులు ఎంతో వెనుకబడి ఉన్నారని వారి జీవన ప్రమాణాలను తీసుకోని ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకంలో ముదిరాజ్ కుటుంబాలను చేర్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దారమోనీ సురేష్‌ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం లక్ష్మిగూడ ముదిరాజ్ భవన్‌లో జరిగిన సమావేశంలో ముదిరాజ్ కులస్తులు, తెలంగాణ ఉద్యమంలో వారి పాత్ర తీరుతెన్నులపై ఆయన మాట్లాడారు.

13 నుంచి 'మనూ'లో జీ-20 స్పెషల్ ఫిల్మ్ ఫెస్టివల్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ అధ్వర్యంలో జీ-20 యూనివర్శిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జూన్ 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఫిల్మ్ ఫెస్టివల్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా తెలుగు బ్లాక్‌బస్టర్ సినిమా ఆర్ఆర్ఆర్ ప్రారంభ సెషన్‌లో ప్రదర్శించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా...

మద్దతు ధర పెంచటం హర్షణీయం

మణికొండ: రైతులకు ఆరుగాలం కష్టపడి పండిచిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు రాక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి దేశ వ్యాప్తంగా అనేక పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను పెంచటం హర్షణీయమని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ కార్యదిర్శ ఎ. జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు డి. మల్లేష్ ఆధ్వర్యంలో మద్దతు ధర పెంచినందుకు దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగి పోవటంతో మద్దతు ధరలు సరిపోవటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచటంతో కొంత ఊరట కలుగుతుందన్నారు.

కుల వృత్తిదారులు రూ.లక్ష పథకానికి దరఖాస్తు చేసుకోండి

రాజేంద్రనగర్: కులవృత్తుల దారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన లక్ష రూపాయల పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ప్రాజెక్ట్ అధికారి రాధారాణి సూచించారు. శుక్రవారం కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి రాధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 15 కులాలకు లక్ష రూపాయల చొప్పున ఈ ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. మీ సేవలో దరఖాస్తు చేసుకొని ఆ పత్రాలను జీహెచ్ఎంసీ యూసీడీ విభాగంలో సమర్పించాలని కోరారు.

సోమవారం నుంచి ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా పరిధిలోని నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంల పరిశీలన సోమవారం నుంచి నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఫస్ట్ లెవల్ చెకింగ్‌లో భాగంగా ఈవీఎంలతో పాటు వీవీప్యాట్‌లను పరిశీలించనున్నారు. రాజేంద్రనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఈవీఎం గోదాముల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఈ ఈవీఎంల గోదాములు గతంలో నిర్మించారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన నియోజకవర్గాల ఈవీఎంలో ఇందులో భద్రపరిచారు. ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్కింగ్‌కు జిల్లా వ్యాప్తంగా అధికారులను నియమించారు.

ప్రజా సంక్షేమమే సర్కారు ధ్యేయం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 68 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు, మహిళా సంఘాలకు రెండు కోట్ల రుణా మంజూరు చెక్కులు, ఆసరా ఫించన్లు, కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రొత్సాహక చెక్కులతో పాటు కులవృత్తులకు సంబంధించిన ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ చంద్రకళ, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సందడిగా సీఎస్ చెస్ టోర్నమెంట్



సాక్షి, సిటీబ్యూరో: అత్తాపూర్‌లోని సీఎస్ చెస్ అకాడమీలో సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా నిర్వహించిన టోర్నీలో బాల క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజేతలకు జాతీయ మాజీ చెస్ ఆటగాడు గోవింద్ శర్మ పురస్కారాలు ప్రదానం చేశారు. రాబోయే రెండేళ్లలో తమ అకాడమీ నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులను అందిస్తామని కోచ్, నేషనల్ ఇన్‌స్ట్రక్టర్ చేతన్ శర్మ ధీమా వ్యక్తం చేశారు. టోర్నీలో సీనియర్స్ విభాగంలో ఇహాస్, జూనియర్స్ విభాగంలో హార్దిక్‌శర్మ చాంపియన్లుగా నిలిచారు.

కారుపై మేకలు కూర్చుంటాయన్నందుకు దాడి..

అత్తాపూర్: మా కారుపై మీ మేకలు కూర్చుంటాయి.. అలా కాకుండా చూడాలని చెప్పిన అన్నదమ్ములపై యువకుడు దాడికి పాల్పడ్డాడు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన మేరకు.. సులేమాన్‌నగర్‌కు చెందిన అహ్మద్(25), మహమ్మూద్ అలీ(26)లు తమ కారును ఇంటి వద్ద పార్క్ చేస్తున్నారు. సమీపంలో రిజ్వాన్(25) మేకలను పెంచుతూ విక్రయిస్తు జీవిస్తున్నారు. అయితే రిజ్వాన్‌కు చెందిన మేకలు వీరి కారుపైకి వెళుతున్నాయి. దీంతో అన్నదమ్ములు గురువారం రిజ్వాన్ ఇంటికి వెళ్లి మేకల సమస్యను చెప్పారు. ఈ క్రమంలో ముగ్గురి మధ్య మాటామాటా పెరిగింది. కర్రతో రిజ్వాన్ ఇరువురు అన్నదమ్ములపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో అన్నదమ్ములు ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. రిజ్వాన్‌ను అత్తాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దాడిలో గాయాలకు గురైన మహమ్మూద్ అలీ (ఇన్‌సెట్‌లో) గాయపడ్డ అహ్మద్

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



నోటుపుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేస్తున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

బండ్లగూడ: విద్యార్థులు చక్కగా చదువుకున్నప్పుడే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చునని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ వెల్లడించారు. గంధంగూడలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేయడంలో ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. విద్యార్థులు చక్కగా చదువకొని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. క్రమ శిక్షణ, పట్టుదలతో చదువుకోవాలన్నారు. తమ లక్ష్యం ఎంత గొప్పగా ఉంటే అంత ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.రాధిక, తలారీ ప్రేమ్‌కుమార్, జి.బాబు, సుబ్బారెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను దూరం చేసుకోవాలి



మణికొండ ఫ్లెజెంట్‌వ్యాలీలో కంటి వెలుగు శిభిరాన్ని ప్రారంభించిన చైర్మెన్, కౌన్సిలర్‌లు

మణికొండ: ప్రస్తుత పరిస్థితిలో పిల్లల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు కంటి సమస్యలు పెరిగిపోతున్నాయని, వాటిని దూరం చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె. నరేందర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ జి.శివారెడ్డిలు అన్నారు. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ 15 వార్డు ఫ్లెజెంట్ వ్యాలీ కాలనీ కమ్యూనిటీహాల్‌లో స్థానిక కౌన్సిలర్ బి. కావ్యశ్రీరాములుతో కలిసి చైర్మెన్, నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట 5వ వార్డులో కౌన్సిలర్ జి.శివారెడ్డిలు కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం తీసుకుంటున్న ఆహారంలో లోపాల కారణంగా కంటి సమస్యలు ఎక్కువవుతున్నాయన్నారు. మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చెరువులను కబ్జాల నుంచి కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో కబ్జాకు గురవుతున్న చెరువులను కాపాడాలని కోరుతూ శుక్రవారం బీజేపీ నాయకులు రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భూముల విలువ అమాంతం పెరిగాయని తెలిపారు. భూముల విక్రయాలు జోరుగా జరుగుతుండడంతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు విచ్చలవిడిగా శిఖం భూములు కబ్జాలు చేస్తూ వాటిలో అక్రమ వెంచర్లు వేసి ప్రభుత్వ ఆశయానికి, ఆదాయానికి గండికొట్టి అమాయక ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.

యువతి అదృశ్యం

రాజేంద్రనగర్: ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్ళిన యువతి కనిపించకుండా పోయిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మార్కండేయనగర్ ప్రాంతానికి చెందిన జి.కృష్ణవేణి(28) ఇంట్లోనే ఉంటోంది. ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఈ నెల 8వ తేదీన ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో కృష్ణవేణి ఫోన్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో ఆసుపత్రి వద్ద, చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


బీసీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మణికొండ: బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టి వారిని ఆదుకుంటోందని నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా బీసీలకు వచ్చిన రూ. లక్ష చెక్కులను నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన రజక వృత్తి చేస్తున్న లక్ష్మీ, మణికొండ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన శివగంగ, ప్రశాంత్‌లకు వారు చెక్కులను అందజేశారు. మొదటి విడతగా 15 కులవృత్తులను చేస్తున్న వారిని ఆదుకునేందుకు ప్రతి కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సహాయం చేస్తుందన్నారు.

వృథాగా నీటి ఫిల్టర్లు

పట్టించుకోని జలమండలి అధికారులు

మణికొండ: గండిపేట నీటిని ఇక్కడికిక్కడే ఫిల్టర్ చేసి ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో రూ.80లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసిన నీటి ఫిల్టర్లు వృథాగా పడి ఉన్నాయి. ప్రస్తుతం మంజీరా నుంచి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు అరకొరగా నీటిని సరఫరా చేస్తున్నారు. అదే గండిపేట నీటిని హైదరాబాద్ నగరంలోని కొన్ని ప్రాంతాలకు ప్రతి రోజు 15 ఎంజీడీ నీటిని సరఫరా చేస్తున్నారు. గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ వరకు మధ్యలో ఫిల్టర్ బెడ్‌లు లేకపోవటంతో స్థానికంగానే ఆ నీటిని తీసుకుని శుద్ధి చేయాలని నిర్ణయించి మణికొండ క్వార్టర్స్ వద్ద ఒకటి, బీఆర్‌సీ అపార్ట్‌మెంట్ ముందు మరొకటి ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు సరిపడా నీటిని అందించాలని ఏర్పాటు చేశారు. వాటిని రెండు సంవత్సరాల క్రితం జలమండలి ఎండీ దానకిషోర్ ఏర్పాటు చేయించి ప్రారంభించారు. అప్పట్లో గండిపేటలో నీరు అడుగండి ఉండటం, వాటిని స్థానికంగా సరిగా ఫిల్టర్ చేయలేక దుర్వాసనతో నీటి సరఫరా జరగటంతో ప్రజలు ఆ నీటిని తిరస్కరించారు. ప్రస్తుతం గండిపేటలో ఎక్కువ మొత్తంలో నీరు ఉండటం, దాన్ని స్థానికంగా ఉన్న ఫిల్టర్ బెడ్‌ల ద్వారా శుద్ధి చేసి అందిస్తే రెండు మున్సిపాలిటీలకు సరిపడా నీటిని అందించే వీలు ఉంటుందని రెండు మున్సిపాలిటీల ప్రజలు సూచిస్తున్నారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు 45 నిముషాల పాటే నీటిని సరఫరా చేస్తుండటంతో అవి ఏమాత్రం సరిపోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. స్థానికంగా ఉన్న ఫిల్టర్ బెడ్‌లను వినియోగంలోకి తెచ్చి సరిపడా నీటిని ఇవ్వాలని వారు కోరుతున్నారు.



బీఆర్‌సీ సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్ బెడ్

జలధారలుగా మార్చాలి...

గండిపేట నీటిని స్థానికంగా ఫిల్టర్ చేసి ఇచ్చే పరిస్థితి లేకపోతే ఫిల్టర్ బెడ్‌లను మణికొండ మర్రిచెట్టు వద్ద సంప్‌కు అనుసంధానం చేసి ఏర్పాటు చేసిన జలధార మాదిరిగా మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మర్రిచెట్టు వద్ద ఏర్పాటు చేసిన జలధార వద్ద రూ.5లకే నాణ్యమైన మంచినీరు లభిస్తుండటంతో ప్రతి రోజూ వందల మంది ఆనీటిని తీసుకువెళుతున్నారు. ఇంటికి సరఫరా అవుతున్న నీటి కన్నా ఇవి నాణ్యతతో ఉన్నాయని స్థానికులు నమ్ముతున్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న రెండు ఫిల్టర్ బెడ్‌లకు మంజీరా నీటి పైప్‌లైన్‌లకు అనుసంధానం చేసి జలధారలుగా మార్చితే మరింత మందికి ఉపయోగంగా ఉంటుందంటున్నారు.

జలధారలను పెంచాలి



మణికొండ మర్రిచెట్టు వద్ద ఏర్పాటు చేసిన జలధార నీటి కేంద్రం నుంచి వేలాది మంది మంచినీటిని తీసుకువెళుతున్నారు. రూ.5కే 20 లీటర్ల నీరు లభిస్తుండటంతో ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. మంజీరా నీరు అప్పటికే శుద్ధి అయి సరఫరా అవుతుండగా వాటిని మరో సారి జలధారలో శుద్ధి చేసి ప్రజలకు అందిస్తుండటంతో ఆదరణ ఉంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని చోట్ల ఇలాంటి జలధారలను ఏర్పాటు చేసే విషయం జలమండలి, మున్సిపాలిటీ అధికారులు ఆలోచన చేయాలి. నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్ బెడ్‌లను మున్సిపాలిటీ తీసుకుని జలధారలు ఏర్పాటు చేయాలి.

– ఆంజనేయులు, ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, మణికొండ